ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 తమిళనాడు TAMILNADU
సోమవారం 21 ఏప్రిల్ 2025

డీఎంకేని నమ్ముకుని డీపీఐ లేదు...! ఏ నిర్ణయానికైనా సిద్ధం

● తిరుమావళవన్



చెన్నై, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో డీఎంకే కూటమి నుంచి డీపీఐ వైదొలుగుతుందని, ఇతర పార్టీలకు కూటమిలో స్థానం కలిగించనున్నారంటూ అన్నాడీఎంకే సహా ప్రత్యర్థులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవాలని డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ తెలిపారు. డీఎంకే కూటమి పటిష్టంగానే ఉన్నప్పటికీ ఎన్నికల దగ్గరపడితే ఆ కూటమిలోని పార్టీలు తమ కూటమిలో చేరే అవకాశాలున్నాయంటూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రత్యర్థులు విమర్శలు చేస్తున్నట్లు డీఎంకేని నమ్ముకుని డీపీఐ లేదని, ఏ పరిస్థితులు ఎదురైనా స్వీయ నిర్ణయం తీసుకోవడానికి వెనుకాడబోదని ఆయన స్పష్టం చేశారు. అన్నాడీఎంకే సహా ప్రత్యర్థులు డీఎంకే కూటమిని బలహీన పరిచేందుకు డీపీఐని పనిముట్టుగా వాడుకుంటున్నాని ఆరోపించారు. ఎన్నికల సమీపించే వేళ డీపీఐ నేతగా తాను స్వీయ నిర్ణయాలు తీసుకునే అవకాశాలు లేకపోలేదన్నారు. ఏది ఏమైనప్పటికీ రాష్ట్రంలో డీఎంకే కూటమి పటిష్టంగానే ఉందని, ఈ కూటమిలో అన్నాడీఎంకేకు చెందిన మిత్రపక్షాలు చేరినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదని తిరుమావళవన్ పేర్కొన్నారు.

ఆ కూటమికి మళ్లీ ఓటమి తథ్యం

● అన్నాడీఎంకే, బీజేపీల మైత్రిపై సీఎం స్టాలిన్ జోస్యం

అడయార్, ఏప్రిల్ 20 : రాష్ట్రానికి తీరని అన్యాయం, వంచన చేస్తున్న బీజేపీతో పొత్తు పెట్టుకున్న అన్నాడీఎంకే కూటమికి ముచ్చటగా మూడోసారి ఓటమి తప్పదని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను తాము వ్యతిరేకించడం లేదన్నారు. ఇకపై సేకరించే జనాభా లెక్కలను ఆధారంగా చేసుకుని నియోజకవర్గాల పునర్విభజననే తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధులతో ఇటీవల ఏర్పాటు చేసిన ఉమ్మడి కార్యాచరణ కమిటీ సభ్యులంతా ప్రధాని మోదీని కలుసుకునేందుకు అపాయింట్‌మెంట్ అడిగారని, త్వరలో ఆయనను కలుసుకునే అవకాశం ఉందన్నారు. జనాభా నియంత్రణ అనేది దేశ ఆర్థికాభివృద్ధి, ప్రజా సంక్షేమం, వృద్ధి వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని 50 యేళ్ళ క్రితం ప్రవేశపెట్టారన్నారు. దేశ శ్రేయస్సును ఆకాంక్షించే రాష్ట్రాల్లో తమిళనాడు మొదటి స్థానంలో ఉందన్నారు. దేశ జనాభా నియంత్రణలో తమిళనాడు భాగస్వామ్యం కీలకమన్నారు. దేశ శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడే తమిళనాడుకు జనాభా లెక్కల ఆధారంగా అన్యాయం చేస్తామంటే సహించే ప్రసక్తే లేదన్నారు. అన్నాడీఎంకే - బీజేపీ కూటమిని డీఎంకే గతంలోనే చిత్తుగా ఒకటికి రెండు సార్లు ఓడించామన్నారు. 2024 ఎన్నికల్లో విడిపోయి పోటీ చేశాయన్నారు. ఇపుడు మళ్ళీ అసెంబ్లీ ఎన్నికల కోసం ఒక్కటయ్యారని, ఈ కూటమికి మరోమారు ఓటమి తప్పదని ఆయన జోస్యం చెప్పారు. తమ ప్రభుత్వంపై బీజేపీ, అన్నాడీఎంకే నేతలు మాత్రమే అవినీతి ఆరోపణలు చేస్తున్నారన్నారు. పదేళ్ళుగా అధికారంలో ఉన్న అన్నాడీఎంకే హయాంలో రాష్ట్రం అన్ని విధాలుగా నష్టపోయిందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాతే అన్ని సరిదిద్ది గాడిలోపెట్టామని, ఫలితంగా రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందన్నారు.

పీఎంకేతో పొత్తా?

డీఎంకే నాయకత్వంలోని కూటమి పటిష్టంగానే ఉందని, ఈ కూటమిని చీల్చేదిశగా ప్రత్యర్థులు పుకార్లు పుట్టిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో పీఎంకే డీఎంకే కూటమిలో చేరనుందంటూ వదంతులు పుట్టిస్తున్నారని స్టాలిన్ ఆరోపించారు. పీఎంకేతో పొత్తు గురించి తమ పార్టీ నాయకులెవరూ రహస్యంగా మంతనాలు జరుపలేదని అన్నారు.

మిత్రపక్షాలు ఇచ్చే సూచనలు, సలహాలతో పాటు వారి ఆందోళనలను కూడా పరిగణనలోకి తీసుకునే తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు.

గవర్నర్ పదవి పోస్టుమన్ వంటిదే

గవర్నర్ పదవి అనేది ఓ పోస్టుమన్ వంటి గౌరవ ప్రదమైన పదవి అని చెప్పారు.. భారత ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్ను ప్రజాప్రభుత్వాలు శాసనసభలో చేసే చట్టాలను గవర్నర్ తొక్కిపెట్టలేరన్నారు. ఈ విషయాన్నే సుప్రీంకోర్టు తన తీర్పులో గుర్తు చేసిందన్నారు. గవర్నర్ ఆర్ఎన్ రవి పదవీకాలం ముగిసిన తర్వాత కూడా ఆయన రాజ్‌భవన్‌లో కొనసాగుతున్నారన్నారు. డీఎంకే ఏ భాషనూ వ్యతిరేకించడం లేదని, హిందీ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తోందని, 90 యేళ్ల క్రితమే హిందీ నిర్బంధంపై ద్రవిడ పార్టీల ప్రజల మధ్య అవగాహన ప్రచారకార్యక్రమాలు నిర్వహించాయన్నారు.

డీఎంకే కూటమి దేశానికే ఆదర్శం : సీపీఎం నేత బేబీ



సీఎం స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ తదితరులు

తమిళనాట డీఎంకే నాయకత్వంలో ఏర్పాటైన కూటమి దేశానికే ఆదర్శవంతమైన కూటమి అని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ అన్నారు. ఆదివారం ఉదయం నగరానికి వచ్చిన బేబీ సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి పి. షణ్ముగం, కేంద్ర కమిటీ సభ్యులు కే బాలకృష్ణన్, వి.వాసుకితో పాటు తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయానికి వెళ్ళి ఆ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సమావేశంలో డీఎంకే కోశాధికారి, ఎంపీ టీఆర్‌బాలు కూడా ఉన్నారు. అనంతరం అరివాలయం వెలుపల బేబీ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ స్టాలిన్‌తో సమావేశమై ప్రస్తుత రాజకీయపరిస్థితులపై చర్చలు జరిపినట్లు తెలిపారు. తమిళ ప్రజల మద్దతుతో మదురైలో పార్టీ 24వ జాతీయ మహానాడు విజయవంతంగా నిర్వహించామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని రాజకీయ పార్టీలన్నీ అసెంబ్లీ ఎన్నికలపై దృష్టిసారిస్తున్నాయని, రాష్ట్రంలో మతతత్వ శక్తులకు ఫుల్‌స్టాప్ పెట్టేలా ప్రజాస్వామ్య, సెక్యులర్ రాజకీయ శక్తులన్నీ ఏకం కావల్సిన తరుణం ఆసన్నమైనదని పిలుపునిచ్చారు. డీఎంకే నాయకత్వంలో ఏర్పాటైన కూటమి మిత్రపక్షాలన్నీ సంతృప్తి చెందేలా పటిష్టంగా కొనసాగుతుండటం హర్షదాయకమన్నారు. దేశమంతటా ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను వ్యాపింపజేసే దిశగా బీజేపీ దేశంలోని మైనారిటీల హక్కులను హరించేందుకు కుట్రలు పన్నుతోందని ఆయన ఆరోపించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వక్ఫ్ చట్టం కూడా మైనారిటీ ముస్లింల మనుగడకే ముప్పు కలిగిస్తుందన్నారు. రాష్ట్ర గవర్నర్ రవి యేళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచిన 10 బిల్లులను సుప్రీం కోర్టు ద్వారా ఆమోదం పొందటం శుభపరిణామమని, సుప్రీం తీర్పు ఎన్నికైన ప్రజాస్వామ్య ప్రభుత్వాల నిర్ణయాలకు లోబడే గవర్నర్ తన విధులను నిర్వర్తించాలని స్పష్టపరిచిందని బేబీ పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీ, అన్నాడీఎంకేల బంధం అపవిత్రమైన కూటమి అని, అసెంబ్లీ ఎన్నికల్లో ఆ కూటమి చిత్తుగా ఓడిపోవటం ఖాయమని తెలిపారు. ఆ రెండు పార్టీల కలయిక నచ్చని ఇతర పార్టీలు డీఎంకే కూటమిలో చేరే అవకాశాలు లేకపోలేదని ఆయన చెప్పారు.

'సహస్ర' దీక్ష

● వెయ్యో రోజుకు చేరిన పరందూరు ఎయిర్‌పోర్ట్ వ్యతిరేకోద్యమం

చెన్నై, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పరందూరు గ్రీన్ ఎయిర్‌పోర్టు ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ ఏకనాపురం సహా 13 గ్రామాల ప్రజలు నిర్వహిస్తున్న ఆందోళన ఆదివారం 1000వ రోజుకు చేరింది. కాంచీపురం సమీపంలోని పరందూరు వద్ద 13 గ్రామాలకు చెందిన సుమారు ఐదు వేల ఎకరాల్లో రెండో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయడానికి భారత విమానయాన సంస్థ నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు అమలు చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు కూడా మంజూరు చేశాయి. త్వరలో స్థల సేకరణ పనులు జరుగుతాయని ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.



ఏకనాపురంలో నిరాహారదీక్ష చేస్తున్న గ్రామస్థులు

ఈ విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయడానికి పరందూరు, నెలవాయిన, నాగపట్టు, ఇడయర్‌పాక్కం, ఏకనాపురం సహా 13 గ్రామాల్లోని పంట భూములను సేకరిస్తే వ్యవసాయానికి దూరమవుతామని, పచ్చటి వాతావరణంలో ఉన్న తమ నివాసాలను కోల్పోయి నిర్వాసితులుగా మారిపోతామని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ ఏకనాపురం వద్ద గ్రామస్థులంతా రిలే నిరాహార దీక్షలు, ధర్నా, రాస్తారోకో తదితర ఆందోళనలు చేస్తూ వచ్చారు. వీరి ఆందోళన ఆదివారం 1000వ రోజుకు చేరింది. ఈ ఆందోళనలో పూఉలగిన్ నన్బర్‌గళ్ సంస్థ సమన్వయకర్త సుందరరాజన్ తదితరులు పాల్గొని విమానాశ్రయ ఏర్పాటు ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తూ ప్రసంగించారు.

'ప్రవచనానికి పరిణితి రూపం హరికథ'

● డాక్టర్ ప్రభల జానకి



జానకిని సత్కరిస్తున్న వేదవిజ్ఞానవేదిక నిర్వాహకులు

వేళచ్చేరి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రవచనానికి పరిణితి రూపం హరికథ అని ప్రముఖ రచయిత్రి, పరిశోధకురాలు డాక్టర్ ప్రభల జానకి అన్నారు. వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాస ధారావాహిక 160వ ప్రసంగ కార్యక్రమం టి.నగర్‌లోని ఆంధ్రా క్లబ్ కృష్ణా హాలులో ఆదివారం సాయంత్రం జరిగింది. కార్యక్రమానికి రచయిత్రి, పరిశోధకురాలు డాక్టర్ ప్రభల జానకి హాజరై 'హరికథాలహరి-నిత్య నూతన సుధామాధురి' అనే అంశంపై ప్రసంగించారు. అరుణా శ్రీనాథ్ ప్రార్థనాగీతంతో ప్రారంభమైన కార్యక్రమంలో వేద విజ్ఞాన వేదిక కార్యదర్శి కందనూరు మధు స్వాగతం పలికారు. అధ్యక్షులు జేకే రెడ్డి వక్తను పరిచయం చేశారు. వక్త రెండు డాక్టరేట్లు సాధించారని, జర్నలిజమ్‌లో డిప్లొమో, రాష్ట్రీయ వికాస శిరోమణి పురస్కారం కూడా పొందారని, ఆకాశవాణి న్యూఢిల్లీలో న్యూస్ రీడర్‌గా పని చేసిన అనుభవం కూడా ఉందని, గాయని, రచయిత్రి, సాహితీవేత్త అయిన డా.ప్రభల జానకి వ్యాసాలు ఎన్నో ప్రచురితవయ్యాయని తెలిపారు. వేద విజ్ఞాన వేదిక నిర్వాహకులు ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్త మాట్లాడుతూ రెండు వందల సంవత్సరాల క్రితం హరికథ ప్రారంభమైందని, ఆదిభట్ల నారాయణదాసు 'హరికథా పితామహుడు'గా పేరొందారని తెలుపుతూ ఆయన 'ధ్రువచరిత్ర' తో హరికథకు నాందీ పలికారని, నాట్యం, సంగీతం, సాహిత్యం కలగలిపి హరికథకు రూపురేఖలు దిద్దారన్నారు. హరికథా కళాకారిణులు ఎంతోమంది కపిలేశ్వరం నుండే వచ్చారని, హరికథ హార్వర్డ్ యూనివర్సిటీ వరకూ వెళ్లిందని చెప్పారు. సంస్కృతం, తెలుగు భాషల్లో ఎంతోమంది హరికథలు చెబుతూ, పద్మశ్రీ పురస్కారాలు కూడా పొందారన్నారు. అనకాపల్లిలో బాలాజీదాసు నారాయణ దాసు కంటే ముందే హరికథలు చెప్పారని, హరికథలు రచించారని చెప్పారు. వక్త గాయని కావడంతో ప్రసంగంలో కొన్ని పాటలు కూడా చొప్పించి శ్రోతల ప్రశంసలు అందుకున్నారు.

గవర్నర్‌ను తొలగించాలంటూ 26న ఎండీఎంకే ధర్నా

● కార్యనిర్వాహక కమిటీ తీర్మానం



కమిటీ సమావేశంలో వైగో, దురై వైగో, మల్లై సత్యా తదితరులు

చెన్నై, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన డీఎంకే ప్రభుత్వానికి అన్ని విధాలా అడ్డంకులు సృష్టిస్తూ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలా వ్యవహరిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవిని ఆ పదవి నుండి తొలగించాలని ఎండీఎంకే కార్యనిర్వహాక కమిటీ సమావేశం డిమాండ్ చేసింది. గవర్నర్‌ను రీకాల్ చేయాలని కోరుతూ ఈ నెల 26న ప్రధాన నగరాల్లో ఎండీఎంకే ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు జరపాలని ఆ సమావేశం తీర్మానించింది. ఎగ్మూరులోని పార్టీ కార్యాలయం 'తాయగమ్'లో ఎండీఎంకే ప్రిసీడియం చైర్మన్ ఆడిటర్ అర్జునరాజ్ అధ్యక్షతన ఆదివారం ఈ సమావేశం జరిగింది. పార్టీ ప్రధాన కార్యదర్శి వైగో, కోశాధికారి ఎం.సెంథిల్‌అదిపన్, ముఖ్య కార్యదర్శి దురై వైగో, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి మల్లై సత్యా, సెంజి ఏకే మణి, ఆడుతురై ఆర్ మురుగన్, టీఎం రాజేంద్రన్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్రంలో మళ్ళీ డీఎంకే అధికారంలోకి రావాలని, ఆ దిశగా మిత్రపక్షాలతో కలిసి ఎండీఎంకే తీవ్రంగా కృషి చేయాలని ఈ సమావేశంలో తీర్మానం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సన్నిహిత సంబంధాల ఏర్పాటు, రాష్ట్ర హక్కులను పరిరక్షించేందుకు జస్టిస్ కురియన్ జోసెఫ్ అధ్యక్షతన కమిటీని నియమించిన డీఎంకే ప్రభుత్వాన్ని ప్రశంసిస్తూ మరొక తీర్మానం చేశారు. గవర్నర్‌ను రీకాల్ చేయాలని కోరుతూ ఈ నెల 26న చెన్నై, తిరుచ్చి, మదురై, కోవై నగరాల్లో పార్టీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు, ధర్నా, రాస్తారోకో చేయాలని కూడా తీర్మానం ప్రతిపాదించారు. పార్టీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి మల్లై సత్యా వైఖరిని ఖండిస్తూ పార్టీ నుండి వైదొలగిన దురై వైగో ఈ సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో దురై వైగోని ముఖ్య కార్యదర్శిగానే అందరూ సంబోధించారు. దీంతో దురై వైగో పార్టీ పదవికి సమర్పించిన రాజీనామాను అంగీకరించలేదని స్పష్టమైంది.

ఇంకా కొనసాగుతున్న మనస్పర్థలు...

ఇదిలా ఉండగా దురైవైగోకు, మల్లై సత్యాకు మధ్య ఇంకా మనస్పర్థలు కొనసాగుతున్నాయని పార్టీ కార్యనిర్వహాక కమిటీ సమావేశంలోనూ స్పష్టమైంది. ఒకే వేదికపై కూర్చున్నా ఎడమొఖం పెడమొఖంగానే వ్యవహరించారు. శనివారం మల్లై సత్యా ఓ వీడియో సందేశం వెలువరిస్తూ వైగోనే తానే సైన్యాధ్యక్షుడినని, అందుకు తన వేలికి ధరించిన వైగో బొమ్మతో కూడిన ఉంగరమే సాక్ష్యమన్నారు. దీనికి దురై వైగో కౌంటర్ ఇస్తూ వైగోకు మల్లై సత్యా మాత్రమే సైన్యాధ్యక్షుడు కాదని, తనతో పాటు పార్టీ సీనియర్లంతా సైన్యాధ్యక్షులేనన్నారు.

కోలాహలంగా 'ఈస్టర్' వేడుకలు



ప్యారీస్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మానవాళి శ్రేయస్సు కోసం శిలువపై ప్రాణాలు విడిచి, మూడవ రోజు పునరుత్థానుడైన యేసుక్రీస్తు మహిమను కీర్తిస్తూ వేకువజామున 3 గంటల నుంచే పండుగను కోలాహలంగా జరుపుకున్నారు. పలు ప్రాంతాల్లో క్రైస్తవులు దీపాలు, కొవ్వొత్తులతో గీతాలు పాడుతూ చర్చి ప్రాంగణానికి చేరుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన పునరుత్థాన ఆరాధనలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.. నాగపట్నం జిల్లాలోని వేలాంకన్ని మేరీమాత ఆలయం, తంజావూరు జిల్లా తిరుత్తరైపూండి మేరీమాత ఆలయం, తూత్తుకుడి పనిమయ మాత ఆలయం, బీసెంట్ నగర్ అన్నై వేలాంకన్ని ఆలయం, సెయింట్ థామస్ మౌంట్ చర్చి, మైలాపూర్ శాంథోం చర్చి, ఎగ్మోర్ సేక్రేడ్ హార్ట్, బాసలిక, పెరంబూరు సెయింట్ పీటర్ చర్చి, జెమిని సర్కిల్‌లోని కెథెడ్రల్ చర్చిల్లో ఈస్టర్ ఆరాధనలు జరిగాయి..

ఎంసీటీబీసీలో..

వెపేరి హైరోడ్డులోని మద్రాస్ సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి (ఎంసీటీబీసీ) కాపరి రెవ.డా. ఎస్ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈస్టర్ ఆరాధనలో సంఘ కార్యదర్శి పోతల ప్రభుదాస్, అధ్యక్షులు జి.రామయ్య, ట్రెజరర్ ఐ.మార్కు, ఇతర కమిటీల నిర్వాహకులు పాల్గొన్నారు. సండే స్కూల్ చిన్నారు, స్త్రీల సమాజం, యూత్, క్వయర్ సభ్యులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



వెపేరిలోని ఎంసీటీబీసీలో ప్రత్యేక ఆరాధనకు హాజరైన క్రైస్తవులు

విల్లివాక్కం రక్షణసైన్యం సంఘంలో..



రక్షణ సైన్యం సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శోభాయాత్ర

విల్లివాక్కం రాజమంగళంలోని రక్షణసైన్యం సంఘంలో కోర్ ఆఫీసర్లు మేజర్ ఆర్.నాగేశ్వరరావు, మేజర్ ఎస్తేర్‌రాణి సారథ్యంలో పునరుత్థానపు ఎదుర్కోలు, పునరుత్థాన ఆరాధనలు జరిగాయి. రాజమంగళం ప్రధాన వీధుల్లో కొవ్వొత్తులతో వేకువజామున 3 గంటలకు శోభాయాత్ర నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయ ప్రాంగణంలో ఈస్టర్ పండుగ సంబరాలను సభ్యుల కుటుంబాలతో కలిసి ఘనంగా జరుపుకున్నారు.

చూలై తెలుగు బాప్టిస్ట్ చర్చిలో..

చూలై కాట్బారు నల్లముత్తు వీధిలోని తెలుగు బాప్టిస్టు చర్చి సీనియర్ పాస్టర్ రెవ.డా.పాల్ ఈశ్వరప్ప, రెవ.యేసుదాస్ సారథ్యంలో ఈస్టర్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. సంఘ చైర్మెన్ జి.సురేష్‌కుమార్, వైస్ చైర్మెన్ ఏ.లాబాను, కార్యదర్శి ఎండీ.వీర్రాజు, ఉపకార్యదర్శి పి.ప్రభుదాస్, కోశాధికారి వి.యేసుదాస్, సంఘ పెద్దలు కె.జాన్సన్, వై.ముత్తుకుమార్, స్త్రీల సమాజం, సండే స్కూల్, యూత్ తదితర విభాగాలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.



చూలై తెలుగు బాప్టిస్టు చర్చిలో ప్రార్థనలు

పెరంబూరులో...

పెరంబూరు కుక్సురోడ్డులోని వాటర్‌బరి మెమోరియల్ తెలుగు బాప్టిస్టు సంఘంలో పరిశుద్ధవారం, శుభశుక్రవారం, పునరుత్థాన ఆరాధన కార్యక్రమాలు సంఘ సీనియర్ పాస్టర్ రెవ.డా.ఎం.పాల్ ఈశ్వరప్ప అధ్యక్షతన ఈ నెల 14వ తేదీ నుండి ఆదివారం వరకు ఘనంగా నిర్వహించారు. పునరుత్థాన దివ్య ఆరాధనల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈస్టర్ సందర్భంగా ఆదివారం రాత్రి 7 గంటలకు యేసుక్రీస్తు జననం, మరణం, పునరుత్థానం విశేషాలతో నిర్మించిన చలనచిత్రాన్ని ప్రదర్శించారు. అసిస్టెంట్ పాస్టర్లు, సంఘ నిర్వాహకులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పరివేక్షించారు.



మైలాపూర్ శాంథోం చర్చిలో ఈస్టర్ సందేశం అందిస్తున్న ఫాదర్, ఆరాధనలో పాల్గొన్న భక్తులు

సమాచార దర్శిని

సమ్మర్ సీజన్ ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం పోదనూరు-బరౌని-పోదనూరు మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. నెం.06055 పోదనూరు - బరౌని ప్రత్యేక రైలు ఈ నెల 26, మే 3, 10, 17, 24 తేదీల్లో పోదనూరు నుంచి ఉదయం 11.50 గంటలకు బయల్దేరి మూడో రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు బరౌని చేరుకుంటుంది. మరోమార్గంలో నెం.06056 బరౌని - పోదనూరు ప్రత్యేక రైలు ఈ నెల 29, మే 6, 13, 20, 27 తేదీల్లో బరౌని నుంచి రాత్రి 11.45 గంటలకు బయల్దేరి నాల్గో రోజు వేకువజామున 3.45 గంటలకు పోదనూరు చేరుకుంటుంది. ఈ రైళ్లు సేలం, జోలార్‌పేట, కాట్పాడి, పెరంబూర్, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ మీదుగా వెళ్లనున్నాయి.

స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్ ఆధ్వర్యంలోని స్పోర్ట్స్ హాస్టల్‌లో బస చేస్తూ శిక్షణ పొందేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థినీ, విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా మే 5వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా 28 ప్రాంతాల్లో ఉన్న స్పోర్ట్స్ హాస్టళ్లలో 7, 8, 9తరగతులు, ప్లస్ -1లో విద్యార్థినీ, విద్యార్థులు చేరవచ్చు.ఆసక్తికలిగిన విద్యార్థులు www.sdat.tn.gov.inలో దరఖాస్తులు పంపించాలి. దరఖాస్తు చేసుకున్న బాలురకు మే 7వతేదీ, బాలికల కు మే 8వ తేది ఇంటర్వ్యూ, పోటీలు నిర్వహించనున్నారు. వివరాలకు నెం.9514000777లో సంప్రదించవచ్చు. ఈ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 30వ తేదీతో ముగియనుందని, మరిన్ని వివరాలకు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్ సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

'యూత్ అవార్డు'కు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): 2025వ సంవత్సరానికి 'ముఖ్యమంత్రి రాష్ట్ర యువజన అవార్డు'కు ఆన్‌లైన్ ద్వారా మే 3వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ విడుదల చేసిన ప్రకటనలో... స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 15 నుంచి 35 ఏళ్లలోపున్న ముగ్గురు మహిళలు, ముగ్గురు పురుషులకు ఈ అవార్డు అందజేస్తున్నారు. పురస్కార గ్రహీతలకు రూ. లక్ష నగదు, ప్రశంసాపత్రం, పతకం అందజేస్తారు. రాష్ట్రంలో ఐదేళ్లుగా నివసిస్తున్న వారై, సమాజసేవల్లో భాగస్వామ్యులై ఉండాలి. ఆసక్తి కలిగిన వారు అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 7401703480, 044-26644794 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

ఆరు నగరాల్లో చెట్ల గణన

పెరంబూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పచ్చదనాన్ని పెంచే ప్రణాళికలు అమలుచేసేలా చెన్నై సహా ఆరు నగరాల్లో చెట్ల గణన నిర్వహించనున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో 23 శాతంగా ఉన్న పచ్చదనాన్ని 33 శాతానికి పెంచేలా రాష్ట్ర ప్రభుత్వం గత 2021 నుంచి చర్యలు చేపట్టింది. ఈ చర్యల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. ప్రస్తుతం ప్రభుత్వ శాఖల ఆధీనంలోని ఖాళీ స్థలాలు, ప్రైవేటు స్థలాల్లో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించనున్నారు. నగరాల్లో పచ్చదనం విస్తీర్ణం తగ్గతున్న నేపథ్యంలో, చెన్నై, కోవై, మదురై, తిరుచ్చి, తిరుప్పూర్, సేలం తదితర ఆరు నగరాల్లో చెట్ల గణన చేపట్టనున్నారు. ఈ గణన ఆధారంగా అవసరమైన ప్రాంతాలు ఎంపిక చేసి మొక్కలు నాటే పనులు చేపట్టనున్నట్లు అటవీ శాఖ తెలియజేసింది.

70 ప్రాంతాల్లో సొరంగమార్గాలు: దక్షిణ రైల్వే

పెరంబూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రజలు రైలు పట్టాలను దాటేందుకు ఇబ్బంది పడకుండా 70 ప్రాంతాల్లో సొరంగమార్గాలు ఏర్పాటుచేయాలని దక్షిణ రైల్వే నిర్ణయించింది. రైలు పట్టాలు దాటుతూ రైళ్లు ఢీకొని మృత్యువాతపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. దీనిని అరికట్టేందుకు సొరంగమార్గం ఏర్పాటుకానుంది. అలాగే, సొరంగ మార్గం వీలుకాని ప్రాంతాల్లో పై ఓవర్లు నిర్మించనున్నారు. ఇందుకోసం, చెన్నై, తిరుచ్చి, సేలం, మదురై, కోవై తదితర రైల్వే డివిజన్ల పరిధిలో 70 ప్రాంతాలు ఎంపిక చేసినట్లు, ఒక్కో సొరంగ మార్గం ఏర్పాటుకు రూ.10 కోట్లు కేటాయించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పనులు ప్రారంభించి త్వరలో సొరంగమార్గాలు, పై ఓవర్లు ప్రజల అందుబాటులోకి తీసుకురానున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

మూలికా సబ్బుల తయారీపై శిక్షణ

పెరంబూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని వ్యవసాయ విశ్వవిద్యాలయం సమాచార, శిక్షణ కేంద్రంలో ఈ నెల 25వ తేది మూలికా సబ్బుల తయారీపై శిక్షణ ఇవ్వనున్నారు. హెర్బల్ సబ్బుల తయారీపై శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. వివరాలకు 044-29530048 అనే నెంబరు సంప్రదించవచ్చు.

పోలీసులకూ హెల్మెట్ తప్పనిసరి

పెరంబూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలపై వెళ్లే పోలీసులు విధిగా హెల్మెట్ ధరించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. రోడ్డు ప్రమాదాల్లో వాహన చోదకులు మృత్యువాత పడకుండా అడ్డుకొనే చర్యల్లో భాగంగా ద్విచక్రవాహనం నడిపేవారు, వెనుక కూర్చున్న వారు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనచోదకులు సీట్ బెల్ట్ ధరించాలని, నిబంధనలు పాటించని వారి నుంచి జరిమానా వసూలుచేస్తామని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.. ఈ క్రమంలో, నగరంలో పోలీసులు ద్విచక్ర వాహనాలపై వెళ్లే సమయంలో హెల్మెట్లు ధరించడం లేదని, ప్రజలకు ఒక రూలు, పోలీసులకు మరో రూలా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై స్పందించిన గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ విడుదల చేసిన ఉత్తర్వుల్లో... ద్విచక్ర వాహనాలపై వెళ్లే పోలీసులు తప్పక హెల్మెట్ ధరించాలని, నిబంధనలు అతిక్రమించే పోలీసులపై శాఖాపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

కొడైకెనాల్‌లో పర్యాటకుల రద్దీ



పెరంబూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా కొడైకెనాల్ పర్యాటకులతో కిటకిటలాడుతోంది. కొండల యువరాణిగా పిలిచే కొడైకెనాల్‌కు ప్రతిరోజు పర్యాటకులు పోటెత్తుతున్నారు. ప్రస్తుతం మూడు రోజులు వరుస సెలవులు రావడంతో, ఎండలతో అల్లాడుతున్న ప్రజలు, కుటుంబాలతో చల్లటి ప్రదేశాలకు పయనమవుతున్నారు.దీంతో, కొడైకెనాల్‌లో పర్యాటకులతో సందడిగా మా రింది. కొడైకెనాల్ అటవీ ప్రాంతంలో ఉన్న గుణ గుహ, పిల్లర్ రాక్, మేయర్ పాయింట్,బెరీజియం నది సహా పలు పర్యాటక ప్రాంతాలు పర్యాటకులతో కళకళలాడుతున్నాయి. పర్యాటకుల రాకతో వ్యాపారాలు పెరిగాయని వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కారు ధ్వంసానికి దారితీసిన చెత్తకుప్ప తగాదా

చెన్నై, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా అమ్మాపాళయంలో పక్కపక్కనే నివసిస్తున్న వారి మధ్య ఏర్పడిన చెత్తకుప్ప గొడవ తీవ్రరూపం దాల్చింది. చెత్త వేసిన మహిళపై ఆగ్రహంతో పక్కింటి వ్యక్తి తన బంధువుకు చెందిన లారీతో ఆమె కారును ఢీకొట్టించి, దాని ముందుభాగాన్ని ధ్వంసం చేసి తన కక్ష తీర్చుకున్నాడు. అమ్మాపాళయంలో ఓ ఇంటి నివసిస్తున్న అనిత తన ఇంటిలో సేకరించిన చెత్తను తన పక్కింటి వద్ద పారబోసింది. అది చూసి ఆ ఇంటిలో నివసిస్తున్న భూపతి ఆగ్రహం చెందాడు. అనితపై కక్షపెంచుకుని తన బంధువు సాయంతో లారీని తెప్పించి, ఆ లారీతో ఆమె ఇంటి ముందున్న కారును ఢీకొట్టించాడు. ఈ సంఘటనపై అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆత్తూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని లారీని నడిపిన బాలమురుగన్ అనే వ్యక్తి ఆచూకీ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.


లారీతో ఢీకొట్టించడంతో ధ్వంసమైన కారు ముందుభాగం

క్రీస్తు బోధనలు అనుసరణీయం

పెరంబూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): యేసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని రెవ.పి.మెల్కీసెదక్ తెలిపారు. స్థానిక కొరట్టూరు కండిగై వీధిలోని 'వే టూ ట్రూ లైఫ్ మినిస్ట్రీస్ (సత్య జీవ మార్గము మినిస్ట్రీస్)' ఆధ్వర్యంలో ఆదివారం యేసుక్రీస్తు పునరుత్థానం (ఈస్టర్) సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ఆరాధన కార్యక్రమంలో మహిళలు, పురుషులు, పిల్లలు పాల్గొన్నారు.


వాక్యపరిచర్య చేస్తున్న రెవ.మెల్కీసెదక్

ఇళ్ల మధ్య తిరుగుతున్న వానరాల పట్టివేత

వేలూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా పేర్నాంబట్టు ప్రాంతంలో ప్రజలను ఇబ్బంది పెడుతూ, ఇళ్ల మధ్య సంచరిస్తున్న కోతులను ఆదివారం ఉదయం మున్సిపల్ అధికారుల సమక్షంలో పట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో సంచరిస్తున్న కోతులు పలువురిపై దాడిచేసిన గాయపరుస్తున్నాయనే ఫిర్యాదుపై స్పందించిన మున్సిపాలిటీ అధికారులు ఆదివారం ఉదయం సుమారు 25 కోతులను పట్టించి, అటవీశాఖ అధికారులకు అప్పగించారు. ఇందులో జిల్లా అటవీశాఖ అధికారి సతీష్‌కుమార్, గుడియత్తం అధికారి రమేష్, మున్సిపాలిటీశాఖ అధికారులు పాల్గొన్నారు.



వేలూరులో ఘనంగా ఈస్టర్ పండుగ

వేలూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): శిలువపై యేసు క్రీస్తు ప్రాణత్యాగం చేసి, మూడోరోజు పునరుత్థానం జరిగిన ఈస్టర్ పండుగను వేలూరులోని క్రైస్తవులు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. జిల్లా అంతటా పలు క్రైస్తవాలయాలు విద్యుద్దీపాలతో శోభిల్లాయి. విన్నారసి చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈస్టర్ సందర్భంగా నిర్వహించిన ప్రార్థనల అనంతరం క్రైస్తవ ప్రజలకు యేసుక్రీస్తు మరణం, పునరుత్థానం తదితర విషయాలను చర్చి ఫాదర్ వివరించారు.



రాజాజీ భవన్‌లో ఘనంగా అంబేడ్కర్ జయంతి

పెరంబూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఎస్సీ, ఎస్టీ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ 134 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీసెంట్ నగర్‌లోని రాజాజీ భవన్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు అరసు అధ్యక్షత జరిగిన కార్యక్రమానికి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీవీ సుధాకర్ నాగభూషణం నేతృత్వం వహించారు. కార్యక్రమంలో రాజాజీ భవన్ జోనల్ డైరెక్టర్ శివకుమార్, ఏఏఓ మణివాచగం, వీఏఓ ఉమామహేశ్వరన్, సీటీడబ్ల్యూటీఏఈ సుందర్‌రాజ్, యూడీసీ ప్రవీణ్ సహా పలువురు పాల్గొన్నారు.


జయంతి వేడుకల్లో అతిథులు, నిర్వాహకులు

31 యేళ్లుగా అజ్ఞాతం: మాజీ నేవీ అధికారి అరెస్టు

అడయార్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అరక్కోణం సమీపంలో ఒక మహిళను కాల్చి చంపిన కేసులో గత 31 యేళ్ళుగా అజ్ఞాతంలో ఉన్న నేవీ మాజీ అధికారిని పోలీసులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ టెక్నాలజీ) సాయంతో అరెస్టు చేశారు. రాణిపేట జిల్లా అరక్కోణం తాలూకా డీఎస్పీగా ఇటీవల జాఫర్ సాదిక్ బాధ్యతలు చేపట్టారు. అరక్కోణం పోలీస్ సబ్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలపై ఆరా తీశారు. ఈ క్రమంలో 1994లో జరిగిన ఒక మహిళ హత్య కేసులో పోలీసులకు నిందితుడు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్నట్టు గుర్తించారు. కేరళ రాష్ట్రంలో నేవీ అధికారిగా పనిచేసిన కొకాయ్‌గా గుర్తించారు. అరక్కోణంలోని ఐఎన్ఎస్ రాజాళి ఆర్మీ కేంద్రంలో పనిచేసే మహారాష్ట్రకు చెందిన చౌదరి అనే వ్యక్తి భార్య జయశ్రీ హత్య కేసులో ప్రధాన నిందితుడని గుర్తించారు. కేరళ రాష్ట్రంలో నేవీ అధికారికంగా పనిచేసే స్నేహితుడు కొకాయ్‌తో కలిసి చౌదరి ఈ హత్య చేసినట్టు తేలింది. ఈ కేసులో పోలీసులు నిందితుడు కోసం అప్పటి నుంచి గాలిస్తున్నారు. ఈ కేసును పరిశీలించిన జాఫర్ సాదిక్.. ఏఐ టెక్నాలజీ ఉపయోగించి వివిధ వయసుల్లో ఎలా ఉంటాడో ఊహా చిత్రాలను గీయించి కొకాయ్‌ను గుర్తించి అరెస్టు చేశారు. ప్రస్తుతం కేరళలో ట్యూషన్ టీచరుగా పనిచేస్తున్న కొకాయ్‌ను ప్రత్యేక బృందం పోలీసులు అరెస్టు చేసి, అరక్కోణం తీసుకొచ్చి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి జైలుకు తరలించారు. 13 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్న నిందితుడిని గుర్తించిన డీఎస్పీని పోలీస్ ఉన్నతాధికారులు అభినందనలు తెలియజేశారు.

పెళ్లి పేరుతో సహాయ నటికి మోసం


● నటుడు 'కాదల్' సుకుమార్ పరారీ

చెన్నై, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పెళ్ళి చేసుకుంటానని నమ్మించి సహాయనటితో రహస్యంగా కాపురం చేసి ఆమె డబ్బు, నగలు కాజేసిన సినీనటుడు 'కాదల్' సుకుమార్‌పై మాంబళం మహిళా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలుసుకుని సుకుమార్ పరారయ్యాడు. 'కాదల్' ద్వారా సహాయనటుడిగా పరిచయమైన సుకుమార్ పలు తమిళ చిత్రాల్లో నటించాడు. మధురవాయల్ కృష్ణానగర్‌లో భార్యతో ఉంటున్నాడు. యేడాది క్రితం సుకుమార్‌కు వడపళనిలో భర్తను విడిచి ఓ ఇంటిలో ఉంటున్న సహాయనటి (36)తో పరిచయం ఏర్పడింది. ఆ సందర్భంగా తాను భార్య నుంచి విడాకులు తీసుకున్నానని చెప్పి, ఆమెను పెట్టి చేసుకుంటానని నమ్మించాడు. అతడి మాటలను నమ్మి ఆమె అడిగినప్పుడల్లా డబ్బు, నగలు ఇస్తుండేది. ఈ క్రమంలో సుకుమార్ భార్యతో విడాకులు తీసుకోలేదనే తెలుసుకుని దిగ్భ్రాంతి చెందింది. గుట్టురట్టయ్యిందని తెలుసుకున్న సుకుమార్ ఆమెతో సంబంధాలు తెంచుకున్నాడు. దీంతో ఆ సహాయనటి వడపళని పోలీసులకు ఫిర్యాదు చేసింది. రోజులు గడిచినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆమె నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదును పరిశీలించిన పోలీసు కమిషనర్ అరుణ్ తక్షణమే చర్యలు తీసుకోవాలని మాంబళం మహిళా పోలీసులకు ఉత్తర్వు జారీ చేశారు. ప్రస్తుతం పరారీలో ఉన్న సుకుమార్ ఆచూకీకోసం పోలీసులు గాలిస్తున్నారు.

బీజేపీ కూటమిదే విజయం: జీకే వాసన్

పెరంబూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూటమిలోని ఎన్డీఏ అధికారం చేపడుతుందని తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) అధ్యక్షుడు జీకే వాసన్ స్పష్టం చేశారు. టీఎంసీ ప్రధాన కార్యదర్శి, జీకేఎం అరిమా సంఘం అధ్యక్షుడు జీఆర్ వెంకటేష్ జన్మదినం సందర్భంగా జీకే వాసన్ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జీకే వాసన్ మాట్లాడుతూ... బీజేపీ-అన్నాడీఎంకే కూటమి ఏర్పాటుతో డీఎంకే కూటమిలో ఆందోళన ప్రారంభమైందన్నారు. అందువల్లే కూటమిపై అసత్య ఆరోపణలు చేస్తున్నాయన్నారు. ప్రస్తుతం పార్టీ బలోపేతంపై దృష్టి సారించినట్లు, విజయావకాలున్న అసెంబ్లీ స్థానాలను ఎన్డీఏ కూటమిలో కోరుతామని జీకే వాసన్ తెలిపారు.


జీఆర్ వెంకటేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న జీకే వాసన్

రైలు నుంచి జారిపడి దంపతుల మృతి

పెరంబూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టరవాక్కం-అంబత్తూర్ రైల్వేస్టేషన్ల మధ్య శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో ఎక్స్‌ప్రెస్ చెన్నై సెంట్రల్ నుంచి ఉత్తరాది రాష్ట్రాల వైపుకు వెళుతోంది. ఆ రైలు నుంచి 30 ఏళ్ల పురుషుడు, మహిళ జారి కింద పడి, తీవ్రగాయాలతో ఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకున్న పెరంబూర్ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

గంజాయి 'హోం డెలివరీ' తల్లీకొడుకుల అరెస్ట్

పెరంబూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలో గంజాయి హోం డెలివరీ చేస్తున్న వ్యవహారంలో తల్లి, కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు ఓమలూరు ప్రాంతంలో ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకుని ఇళ్లకే గంజాయి సరఫరా చేస్తున్న పూంగొడి, ఆమె కుమారుడు సంతోష్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు, వారి నుంచి 3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

నీటమునిగి బాలుడి మృతి

పెరంబూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఈత నేర్చుకోవాలని వెళ్లిన బాలుడు నీటమునిగి మృతిచెందిన ఘటన తిరుపత్తూర్ జిల్లాలో చోటుచేసుకుంది. పెరియవెంగాయపల్లికి చెందిన ఆర్య అదే ప్రాంతంలోని పాఠశాలలో 6వ తరగతి చదువుకున్నాడు. పాఠశాలలకు సెలవులు కావడంతో 8 మంది స్నేహితులతో కలసి సమీపంలోని చెరువుకు వెళ్లాడు. వారు ఈత నేర్చుకుంటున్న సమయంలో, ఆర్య లోతైన ప్రాంతంలో మునిగిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని గంట సేపు గాలించిన ఆర్య మృతదేహం వెలికితీశారు. కాగా, వారిలో ఒక్కరికి కూడా ఈత రాదని పోలీసులు విచారణలో తెలిసింది.

5 నుంచి పీజీ టీచర్లకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

పెరంబూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పోస్ట్ గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులకు నైపుణాభివృద్ధి శిక్షణ మే 5వ తేది నుంచి ప్రారంభమవుతుందని రాష్ట్ర విద్య పరిశోధన డైరెక్టరేట్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు జిల్లా ప్రధాన విద్యాధికారులకు డైరెక్టరేట్ పంపిన సర్క్యులర్‌లో.. రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ సంస్థ ద్వారా 2025-26 విద్యా సంవత్సరం నుంచి పీజీ ఉపాధ్యాయులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ నిర్వహించాలని నిర్ణయించారు. నుంగంబాక్కంలోని ప్రొఫెసర్ అన్బళగన్ విద్యా సముదాయంలో మే 5వ తేది నుంచి శిక్షణ ప్రారంభం కానుంది. మే 16వ తేది వరకు జరిగే శిక్షణకు హాజరయ్యే టీచర్లకు సెలవులు మంజూరు చేయాలని, శిక్షణలో పాల్గొనే ఉపాధ్యాయులు తమ సబ్జెక్ట్‌లకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు తీసుకురావాలని డైరెక్టరేట్ సర్క్యులర్‌లో తెలిపింది.

సబర్బన్ రైలు చక్రం నుంచి పొగలు

పెరంబూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): సబర్బన్ రైలు చక్రం నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళన చెందారు. విల్లుపురం నుంచి తాంబరం వస్తున్న సబర్బన్ రైలు ఆదివారం ఉదయం 6.35 గంటలకు మధురాంతకం రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. కొద్దిసేపటికి బయల్దేరిన రైలు చక్రం నుంచి పొగలు రావడాన్ని గమనించిన ప్రయాణికులు డ్రైవర్‌కు తెలియజేయడంతో, ఆయన రైలు నిలిపివేశారు. డ్రైవర్ కిందకు దిగి చూడగా, బ్రేక్ షూ గట్టిగా అతుక్కుపోయి ఉండడం గమనించి, ప్రయాణికుల సాయంతో బ్రేక్ షూ విడదీసిన అనంతరం 40 నిమిషాలు ఆలస్యంగా బయల్దేరి వెళ్లింది.

డీఎంకేలో చేరిన యువత



వేలూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియత్తంలో ఆ ప్రాంతం యువజన విభాగం కార్యదర్శి అన్బరసన్ సమసక్షంలో నియోజకవర్గంలోని సుమారు 300 మంది యువకులు డీఎంకే పార్టీలో చేరారు. గుడియయత్తం తూర్పు యూనియన్ కార్యదర్శి ప్రదీప్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దేవరాజ్, కార్యదర్శి అమర్, ఉపాధ్యక్షుడు విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా జల్లికట్టు

అడయార్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పుదుక్కోట జిల్లా ఆలంకుడి సమీపంలోని అరసంపట్టిలో మయిల్ వాహన ఆలయంలో వార్షిక వేడుకలు జరుగుతున్నాయి. ఈ వేడుకలను పురస్కరించుకుని జల్లికట్టు పోటీలను నిర్వహించారు. మొత్తం 650 ఎద్దులు, 250 మంది యువకులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. విజేతలకు వివిధ రకాలైన బహుమతులు అందజేశారు.

ఐదేళ్లలో 11వేల బాల్యవివాహాలకు అడ్డుకట్ట

పెరంబూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐదేళ్లలో 11,573 బాల్యవివాహాలను అధికారులు అడ్డుకున్నారు. వివాహ వయసు రాకుండానే బాల్యవివాహం చేసుకునే యువకుడు, అంగీకరించిన తల్లిదండ్రులు, బంధువులపై కేసు నమోదుచేస్తుండగా, ఈ నేరం కింద రెండేళ్ల జైలు, రూ. లక్ష జరిమానా విధిస్తున్నారు. బాల్యవివాహాలు అడ్డుకొనేలా సాంఘిక సంక్షేమ శాఖ పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో ఈరోడ్, తిరునల్వేలి, పెరంబలూరు, కోయంబత్తూర్, దిండుగల్ తదితర జిల్లాల్లో బాల్యవివాహాలు అధికంగా జరుగుతున్నాయి. రాష్ట్రంలో ఐదేళ్లలో 11,753 బాల్యవివాహాలను అధికారులు అడ్డుకున్నట్లు అధికారులు తెలిపారు. బాల్యవివాహాలపై 1098 అనే నెంబరుకు ఫిర్యాదు చేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

విద్యార్థులకు వ్యవసాయంపై శిక్షణ



వేలూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఏపీజే అబ్దుల్ కలామ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అరక్కోణంలోని వ్యవసాయ కళాశాల విద్యార్థులకు కృత్రిమ వ్యవసాయంపై శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రకృతి వ్యవసాయం, రసాయన రహిత పంట, పంటకు పోషక విలువలు అందించే పలు విషయాలను తెలియజేశారు. అనంతరం ప్రముఖ పారిశ్రామికవేత్త ధర్మానసన్ చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ కలామ్ ట్రస్ట్ నిర్వాహకులు, కళాశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



వేలూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని వేలూరులోని సీఎస్ఐ చర్చి నిర్వాహకుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో వంద మంది క్రైస్తవులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి అధ్యక్షుడు సాల్మన్, కార్యదర్శి జాన్, డ్యానియేల్ తదితరులు పాల్గొన్నారు.

నయినార్ సత్కార సభలో ఎంజీఆర్ వేషంలో డ్యాన్స్



చెన్నై, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్‌కు పార్టీ స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన సత్కార సభలో ఓ యువకుడు ఎంజీఆర్ వేషంలో నృత్యం చేసి ఆకట్టుకున్నాడు. అయితే ఎంజీఆర్ వేషంలో ఉన్న ఆ యువకుడు బీజేపీ జెండా పట్టుకుని డ్యాన్స్ చేయడం అన్నాడీఎంకే నేతలకు ఆగ్రహం తెప్పించింది. ఎంజీఆర్‌కు బీజేపీ సంబంధం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఆ యువకుడి డ్యాన్స్‌కు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తీవ్రంగా వైరల్ అవుతోంది.

తిరుత్తణిలో ప్రారంభమైన ప్రజా వైద్యశాల

తిరుత్తణి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన, అత్యాధునిక వసతులతో తిరుత్తణిలో నూతనంగా నిర్మించిన ప్రజా వైద్యశాల శనివారం ప్రారంభమైంది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దీనిని ప్రారంభించారు. 2022వ సంవత్సరంలో రాష్ట్రప్రభుత్వం రూ.45 కోట్లతో నిర్మాణం పనులు ప్రారంభించినన ఈ ఆస్పత్రి, శనివారం అధికారుల సమక్షంలో రోగులకు వైద్య చికిత్సలు అందించారు. ఈ సందర్భంగా ప్రజా పనుల శాఖ ఏఈఈ మురళి మాట్లాడుతూ, ఆర్కేపేట, పళ్లిపట్టు, తిరువలంగాడు, తిరుత్తణి తదితర ప్రాంతాల ప్రజల అభ్యర్థన మేరకు 2022లో రాష్ట్రప్రభుత్వం నిర్మించిన ఈ ఆస్పత్రిలో అత్యవసర చికిత్సా విభాగం, స్కానింగ్, ఎక్స్‌రే తదితర అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

కరెంట్ స్తంభం నుంచి పడి వ్యక్తి మృతి


ఎల్లప్పన్ (ఫైల్‌ఫొటో)

తిరుత్తణి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కరెంట్ స్తంభంపైకెక్కి మరమ్మతులు నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగి కిందపడి మృతి చెందిన ఘటన తిరువళ్లూరు జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే తిరుత్తణి పరిధిలోని కేజీ కండ్రిగైలో విద్యుత్ శాఖ లైన్‌మన్‌గా పనిచేస్తున్న ఎల్లప్పన్ (38) శనివారం ఉదయం 11 గంటలకు సమీపప్రాంతమైన సేచుకునూరు గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్యలు తలెత్తడంతో, స్తంభంపైకెక్కి రిపేరు చేస్తున్న సమయంలో కాలుజారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

శివలింగంపై సూర్య కిరణాలు

అడయార్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అరియలూరు జిల్లా టి.పళూర్ సమీపంలోని కారైక్కురిచ్చిలో సౌందరనాయకి సమేత పసుపతీశ్వరర్ ఆలయంలోని శివలింగంపై సూర్యకిరణాలు పడిన అద్భుత దృశ్యం కనిపించింది. ప్రతి యేటా ఏప్రిల్, ఆగస్టు 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకు శివలింగంపై సూర్య కిరణాలు ప్రసరిస్తుంటాయి. ఏప్రిల్, ఆగస్టు నెలల్లో సూర్య భగవానుడు ఇక్కడకు వచ్చి పరమేశ్వరుడుని ఆరాధిస్తాడన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 6.10 నుంచి 6.20 గంటల మధ్య ఈ సూర్య కిరణాలు ప్రసరించాయి.

కిక్కిరిసిన హొగెనేకల్ జలపాతం

చెన్నై, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం హొగెనేకల్ జలపాత ప్రాంతానికి ఆదివారం ఉదయం వేల సంఖ్యలో పర్యాటకులు తరలిరావటంతో అక్కడ వ్యాపారాలు ఊపందుకున్నాయి. జలపాతంలో దోనెల సవారీ చేసేందుకు పర్యాటకులు బారులు తీరారు. హొగెనేకల్ జలపాతానికి రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు కూడా అధిక సంఖ్యలో వస్తుంటారు. ప్రస్తుతం గుడ్‌ఫ్రైడేతో పాటు వరుసగా మూడు రోజులు సెలవు రావటంతో ఈ జలపాతానికి పర్యాటకులు భారీ సంఖ్యలో వచ్చారు. ఆదివారం వేకువజామునే జలపాతంలో స్నానం చేసేందుకు పర్యాటకులు పోటీపడ్డారు. ఇదే విధంగా అంజెట్టి, కేరట్టి, నాట్రాంపాళయం, రాశిమణల్, పిలిగుండ్లు తదితర ప్రాంతాల్లో తేలికపాటి వానజల్లులు కూడా పడటంతో ఆ ప్రాంతాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. ప్రస్తుతం జలపాతానికి వచ్చే నీటి పరిణామం పెరగడంతో ప్రధాన జలపాతం, ఐందరువి, సినీ ఫాల్స్ జలపాతాలు జలకళను సంతరించుకున్నాయి. మొసళ్ల పార్కు, చిల్డ్రన్స్ పార్కు తదితర ప్రాంతాలను పర్యాటకులు కుటుంబ సమేతంగా వీక్షించారు. ఇక మహిళలు కావేరి నదిలో స్నానం చేసిన తర్వాత రోడ్‌సైడ్ తినుబండారల దుకాణాల్లో విక్రయించిన చేపల పులుసు అన్నం కొని ఉద్యానవనాల్లో కూర్చుని ఆరగించారు. జలపాతం సమీపంలో ఉన్న దుకాణాలలో అమ్మకాలు కూడా పెరగటంతో వ్యాపారులు సంతసించారు.


హొగెనేకల్ జలపాతం వద్ద పర్యాటకుల స్నానాలు



ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా హీరో వెట్రి

'8 తోట్టాగల్' ఫేం వెట్రి పోలీస్ అధికారి పాత్రలో ఎన్‌కౌంటర్ స్పెషలిస్టుగా కనిపించనున్నారు. ఆయన నటించే కొత్త చిత్రం పూజా కార్యక్రమం నగరంలో తాజాగా జరిగింది. డ్రీమ్ హౌస్, జైన్ క్రియేషన్స్ పతాకంపై హారూన్, మహేంద్ర జైన్ సంయుక్తంగా ప్రొడక్షన్ నెం-2 అనే వర్కింగ్ టైటిల్‌తో నిర్మిస్తున్నారు. ఇందులో వెట్రి సరసన టాలీవుడ్ నటి అక్షిత హీరోయిన్‌గా నటిస్తున్నారు. వీరితో పాటు బాలాజీ శక్తివేల్, సింగం పులి, చాందిని, జాన్సన్, కల్కి, కోడంగి వడివేలు తదితరులు నటిస్తున్నారు. 'వెట్', '7-జి' వంటి చిత్రాలను దర్శకత్వం వహించిన హారూన్ ఈ మూవీకి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు సమకూర్చి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా గురించి దర్శకుడు హారూన్ మాట్లాడుతూ, '8 తోట్టాగల్ సినిమా ద్వారా వెట్రి ఎన్‌కౌంటర్ స్పెషలిస్టుగా కనిపించనున్నారు. కొన్ని ముఖ్య పాత్రల్లో ప్రధాన నటులు నటిస్తున్నారు. స్క్రిప్టును సస్పెన్స్ బాణీలో సిద్ధం చేశాం' అని వెల్లడించారు.



వెట్రి, హారూన్, అక్షిత

'మండాడి' మూవీ ప్రారంభోత్సవం

శక్తికి మించి సంపాదించాను..

ఇక చాలు

● నటుడు సూరి

ఖాళీ చేతులతో చిత్రపరిశ్రమలోకి వచ్చానని, ఇపుడు శక్తికి మించి సంపాదించానని, దీనికంతటికీ ఏకైక కారణం దర్శకుడు వెట్రిమారన్ అని ప్రముఖ నటుడు సూరి అన్నారు. 'మామన్' మూవీ తర్వాత సూరి హీరోగా నటిస్తున్న చిత్రం 'మండాడి'. ఆర్ ఎస్ ఇన్ఫోటైనమెంట్ పతాకంపె ఎల్రెడ్ కుమార్ నిర్మిస్తున్నారు. మదిమారన్ పుగళేంది దర్శకుడు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీత దర్శకుడు. ఈ సినిమా అనౌన్స్‌మెంట్, ఫస్ట్‌లుక్ రిలీజ్ శనివారం రాత్రి నగరంలోని ఒక హోటల్‌లో జరిగింది. జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ సహా అనేక మంది సినీ ప్రముఖులు పాల్గొని చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. ఇందులో హీరో సూరి మాట్లాడుతూ, 'నా కొత్త చిత్రం ప్రారంభోత్సవ వేడుక ఇంత గ్రాండ్‌గా నిర్వహిస్తారని ఊహించలేదు. నేను పాల్గొన్న ప్రతి చోటా చెప్పినట్టుగానే దీనికంతటికీ కారణం దర్శకుడు వెట్రి మారన్. ఆయన నాపై నమ్మకం ఉంచి 'విడుదలై' చిత్రంలో హీరోగా అవకాశం ఇచ్చారు. ఖాళీ చేతులతో చెన్నై వచ్చాను. ఇపుడు శక్తికి మించి సంపాదించాను. నాకిది చాలు. ఇకపై నాకు నచ్చిన చిత్రాల్లో నటిస్తే చాలు. ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడం అనేది ఆ భగవంతుడుతోపాటు కళామతల్లి చూసుకుంటుంది' అని అన్నారు. దర్శకుడు వెట్రిమారన్ మాట్లాడుతూ, 'సూరికి ఎలాంటి పాత్ర ఇచ్చినా నటిస్తారు. మానసికంగా, శారీరకంగా ఎంతో బలంగా ఉంటాడు. ఎంతగా బాధపెట్టినా ఓపికగా తట్టుకుని నిలబడతాడు' అన్నారు. కాగా, ఈ చిత్రంలో ముత్తుకాళి అనే పాత్రలో సూరి నటిస్తుండగా, హీరోయిన్‌గా మహిమా నంబియార్, సత్యరాజ్, సంజనా, అచ్యుత్ కుమార్, రవీంద్ర విజయ్, సుహాస్ తదితరులు నటించారు.

చిత్రజ్యోతి

మీ ప్రేమాభిమానాలే ఈ స్థాయికి చేర్చాయి

- వసంత్ రవి



తనపై మీడియా మిత్రులు చూపిస్తున్న ప్రేమాభిమానాల వల్లే తాను ఈ స్థాయికి చేరుకున్నట్టు నటుడు వసంత్ రవి అన్నారు. అలాగే, తన పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయంపై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'కొన్ని ప్రత్యేక క్షణాల్లో వ్యక్తం చేసే ప్రేమాభిమానాలు జీవితంలో మరుపురాని జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి. నా పుట్టిన రోజు సందర్భంగా మీరంతా నాపై చూపించిన ప్రేమ, ఆశీర్వాదాలు నన్ను ఎంతగానో కదిలించాయి. ఇవి నా మనసులో ఎప్పటికీ నిలిచిపోయే తీపి జ్ఞాపకంగా మారిపోతుంది. త్వరలోనే ప్రతి ఒక్కరినీ కలుసుకుంటాను. నేను చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టినప్పటి నుంచి ఇప్పటివరకు మీరు చూపిస్తున్న ప్రేమ, ఆదరణ, మద్దతు వల్లే ఈ స్థాయికి చేరుకున్నాను. ముమ్ముందు కూడా ఇలానే కొనసాగాలని కోరుకుంటున్నాను. అతి త్వరలోనే అందరినీ కలుసుకుని, నేను నటించే చిత్రాలు వివరాలను వివరిస్తాను' అని పేర్కొన్నారు.

23న విజయ్ సేతుపతి 'ఏస్' రిలీజ్

'మహారాజా' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత విజయ్ సేతుపతి నటించిన తాజా చిత్రం 'ఏస్' 23 న విడుదల చేయనున్నట్టు మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. గత యేడాది నుంచి చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ మూవీలో హీరోయిన్‌గా కన్నడ నటి రుక్మిణి వసంత్ నటించారు. ఈమె గతంలో 'ఒరు నల్ల నాల్ పాత్తు సొల్రేన్' అనే సినిమా ద్వారా కోలీవుడ్‌లో అడుగుపెట్టారు. ఇపుడు ఏకంగా విజయ్ సేతుపతి చిత్రంలో అవకాశాన్ని చేజిక్కించుకున్నారు. యోగిబాబు, బబ్లూ పృథ్వీరాజ్, పీఎస్ అవినాశ్, దివ్య పిళ్ళై తదితరులు ఇతర పాత్రలు పోషించారు. జస్టిన్ ప్రభాకరన్ సంగీతం. 'ఏస్' మూవీ ఫస్ట్‌లుక్, టీజర్‌ను కొన్ని నెలల క్రితం విడుదల చేశారు. ఈ నేపథ్యంలో సినిమా రిలీజ్ తేదీ పోస్టరు ద్వారా మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. మూవీ ట్రైలర్, ఆడియోను త్వరలోనే విడుదల చేయనున్నారు.


'ఏస్'లో విజయ్ సేతుపతి

చిత్తిరై ఉత్సవాలకు

సిద్ధమవుతున్న మదురై

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి శేఖర్‌బాబు

చెన్నై, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మదురైలోని సుప్రసిద్ధ మీనాక్షి సుందరేశ్వరుల ఆలయంలో నిర్వహించే చిత్తిరై ఉత్సవాల ముందస్తు ఏర్పాట్లను ఆదివారం ఉదయం రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు అధికారులతో కలిసి పరిశీలించారు. చిత్తిరై ఉత్సవాలు ఈ నెల 29న ధ్వజారోహణంతో ప్రారంభమై మే 12 వరకు జరుగుతాయి. ముఖ్యంగా మే 8న జరిగే ఆదిదంపతుల తిరుకల్యాణోత్సవం చూసేందుకు రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి కూడా భక్తులు వేల సంఖ్యలో రానున్నారు. ఆ తర్వాత రథోత్సవం, కళ్లలగర్‌స్వామి వైగై నదిలో వేంచేసే ఘట్టం తదితర వేడుకలు కూడా జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు సంబంధించి ఆలయ నిర్వాహకులు, మదురై కార్పొరేషన్ అధికారులు, పోలీసు అధికారులతో ఏర్పాట్లను మంత్రి పీకే శేఖర్‌బాబు పరిశీలించారు. ఈ వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సదుపాయాలు, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. మంత్రులు పళనివేల్ త్యాగరాజన్, మూర్తి, జిల్లా కలెక్టర్ సంగీత, నగర పోలీసు కమిషనర్ లోకనాథన్ తదితరులు మంత్రితోపాటు ఏర్పాట్లను పరిశీలించారు.


మీనాక్షి ఆలయం వద్ద అధికారులతో చర్చిస్తున్న మంత్రి శేఖర్‌బాబు


కళ్లలగర్‌స్వామి వేంచేయనున్న వైగై డ్యామ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రులు

నేత్రపర్వంగా తూండుకై వినాయక ఆలయ

కుంభాభిషేకం


ఆలయ గర్భాలయ గోపురంపై సంప్రోక్షణ చేస్తున్న వేదపండితులు

చెన్నై, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామివారి ఆలయానికి ఉప ఆలయం, తూండుకై గణపతి ఆలయ జీర్ణోద్ధరణ అష్టబంధన మహా కుంభాభిషేకవేడుకలు ఆదివారం ఉదయం నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ వేడుకలను పురస్కరించుకుని తూండుకై వినాయకస్వామి ఆలయం సమీపంలో ఉన్న పిళ్లయన్ కట్టలై మండపంలో ఈ నెల 17 నుంచి యాగశాల పూజలు జరిగాయి. ఆదివారం ఉదయం చతుర్థ యాగశాల పూజలు జరిగాయి. ఉదయం 9.30 గంటలకు వివిధ నదీ జలాల కలశాలను ఆలయ ప్రధానార్చకులు, వేదపండితుల మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ ఊరేగించి గర్భాలయం విమాన గోపురం పైకి తీసుకెళ్లారు. గోపుర కలశాలను పవిత్ర జలాలలో సంప్రోక్షించి, ఆలయం చుట్టూ ఉన్న భక్తులపై పవిత్ర జలాలను చల్లారు. ఆ తర్వాత వినాయకస్వామికి మహా అభిషేకం, దీపారాధన నిర్వహించారు. ఆ సందర్భంగా భక్తులను అన్న సంతర్పణ కూడా చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ అరుళ్ మురుగన్, డిప్యూటి కమిషనర్ జ్ఞానశేఖరన్, దేవాదాయ శాఖ జోనల్ డిప్యూటీ కమిషనర్ అన్బుమణి, తిరుచెందూరు డీఎస్పీ మహేష్‌కుమార్, తహసీల్దార్ బాలసుందరం, మునిసిపల్ చైర్‌పర్సన్ శివానంది, కమిషనర్ కన్మణి, ఆలయ సహా కమిషనర్ నాగవేల్, సూపరింటెండెంట్లు అజిత్, అర్పుదమణి, వివేక్, రోహిణి, విజయలక్ష్మి అయ్యర్ సెంథిల్ నాయకి, సూపర్‌వైజర్ సెంథిల్‌కుమార్, ఉభయదారులు రామభూపతి, రుద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.


పవిత్రనదీ జలాల కలశాలను తీసుకెళ్తున్న వేదపండితులు, ఉభయదారులు


కుంభాభిషేకవేడుకలకు హాజరైన భక్తులు

పాఠశాల విద్యార్థులకు విమానయానం

పెరంబూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పల్లావరంలోని మరైమలై అడిగల్ ప్రభుత్వ మహోన్నత పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణిస్తున్నారు. ఈ క్రమంలో, క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనలు, క్లాట్, ఎన్ఎంఎంఎస్‌లో జిల్లా, రాష్ట్రస్థాయిలో బహుమతులు గెలుచుకున్న 13 మంది విద్యార్థులను విద్యా పర్యటనకు తీసుకెళ్లాలని ప్రధానోపాధ్యాయుడు రవి కాశి వెంకట్రామన్ నిర్ణయించారు. 'దట్స్ మై చైల్డ్' అనే స్వచ్ఛంధ సంస్థ సహకారంతో 13 మంది విద్యార్థులను విమానంలో బెంగళూరు తీసుకెళ్లారు. బెంగళూరులోని విశ్వేశ్వరయ్య మ్యూజియం, 'ఇస్రో' పరిశోధన కేంద్రం తదితరాలను విద్యార్థులు సందర్శించారు. విద్య, క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణిస్తున్న విద్యార్థులకు మరింత ప్రోత్సాహం అందించేలా ఈ పర్యటన ఏర్పాటుచేసినట్లు హెచ్ఎం తెలిపారు.


చెన్నై విమానాశ్రయంలో విద్యార్థులు

బలమైన ద్వైపాక్షిక సంబంధాలతోనే

ఆర్థిక ప్రగతి సాధ్యం

● ఆర్థికవేత్త గురుమూర్తి

చెన్నై, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత భౌగోళిక రాజకీయమార్పుల్లో ప్రపంచీకరణ రోజులు ముగిశాయని, భారతదేశం కొన్ని దేశాలతోనే బలమైన ద్వైపాక్షిక సంబంధాలను కొనసాగించాలని ప్రముఖ ఆర్థికవేత్త, రాజకీయ వ్యాఖ్యాత ఎస్. గురుమూర్తి అన్నారు. శాస్త్రా విశ్వవిద్యాలయం చెన్నై క్యాంపస్‌లో నిర్వహించిన 19వ సీయూబీ నారాయణన్ స్మారకోపన్యాస కార్యక్రమంలో గురుమూర్తి 'ప్రపంచ వ్యాప్త వాణిజ్యం - సుంకాల భవిష్యత్తు' అనే అంశంపై ప్రసంగించారు. ప్రస్తుత సుంకాల పోరులో మన బలమైన సామాజిక, ఆర్థిక పునాదుల కారణంగా ప్రస్తుత ప్రపంచ వ్యాప్త వాణిజ్య సంక్షోభంలో భారతదేశం తక్కువ స్థాయిలోనే నష్టపోతూ ఆర్థికపటుత్వాన్ని కలిగిఉంటోందన్నారు. శాస్త్రా విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఎస్. వైద్య సుబ్రమణ్యం స్వాగతోపన్యాసం చేశారు. సిటీ యూనియన్ బ్యాంక్‌చైర్మన్ జి. మహాలింగం వందన సమర్పణ కావించారు.


శాస్త్రా విశ్వవిద్యాలయం సభలో పాల్గొన్న ఎస్.గురుమూర్తి

విద్యార్థులు అవకాశాల కోసం పోటీ పడాలి

● ఐఓబీ ఎండీ అజయ్‌కుమార్ శ్రీవత్సవ
● ఘనంగా ఆర్ఎంకే కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ స్నాతకోత్సవం



ఐఓబీ ఎండీని జ్ఞాపికతో సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆర్ఎస్ మునిరత్నం తదితరులు

ప్యారీస్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచి అవకాశాల కోసం పోటీపడి జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) చెన్నై మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో అజయ్‌కుమార్ శ్రీవత్సవ పేర్కొన్నారు. తిరువళ్లూరు జిల్లా కవరైపేటలోవున్న ఆర్ఎంకే కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ 12,13వ స్నాతకోత్సవాలు ఆదివారం కళాశాల ప్రాంగణంలోని ఆర్ఎంకేఈసీ ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. ఇందులో 2023-2024వ బ్యాచ్‌కు చెందిన అన్నా యూనివర్శిటీ ర్యాంకులు పొందిన 54 మంది విద్యార్థులను ప్రోత్సహిస్తూ, కళాశాల యాజమాన్యం తరుఫున ప్రశంసాపత్రం, రూ.6.75 లక్షల క్యాష్ అవార్డును అందజేశారు. అలాగే వివిధ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసిన 977 మంది విద్యార్థినీ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఆర్ఎంకే విద్యాసంస్థల వ్యవస్థాపకులు, చైర్మెన్, మాజీ ఎమ్మెల్యే విద్యారత్న ఆర్ఎస్ మునిరత్నం ప్రార్థనాగీతం అనంతరం స్నాతకోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన గ్రాడ్యుయేట్లకు, వారిని చదివించిన తల్లిదండ్రులకు తన హృదయపూర్వకంగా అభినందించారు. 31ఏళ్ళ క్రితం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నతశ్రేణి విద్య అందించాలనే సంకల్పంతో లక్ష్మీ కాంతమ్మాళ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ స్థాపించి, దీని ద్వారా ఆర్ఎంకే, ఆర్ఎండీ ఇంజనీరింగ్ కళాశాలలో పాటు ఆర్ఎండీ సీనియర్ సెకండరీ పాఠశాలలను ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు. తమ సంస్థల్లో 1200 మంది ప్రొఫెసర్లు, 3,900మంది పలు విభాగాలకు చెందిన ఉద్యోగుల సహకారంతో ఈ విద్యాసంస్థలను అభివృద్ధి బాటలో నడుపుతున్నట్లు తెలిపారు. 2021 నుండి 2025వ సంవత్సరం వరకు 150 ప్రముఖ కంపెనీలు తమ విద్యాసంస్థలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 91.15 శాతం మంది విద్యార్థులు సంవత్సరానికి రూ.5.8లక్షల నుండి రూ.41లక్షల జీతాలతో కూడిన ఉద్యోగాలు పొందడం సంతోషకరమన్నారు. అనంతరం ముఖ్యఅతిథి అజయ్‌కుమార్ మాట్లాడుతూ, ఆర్ఎంకే విద్యాసంస్థల చైర్మెన్ ఆర్ఎస్ మునిరత్నం, వైస్ చైర్మెన్ ఆర్ఎం.కిషోర్‌లు విద్యార్థులను, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది తమ కుటుంబ సభ్యుల్లాగా చూసుకోవడంవల్లే ఈ సంస్థ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని ప్రశంసించారు. అనంతరం ఆర్ఎంకే విద్యాసంస్థల వైస్ చైర్మెన్ ఆర్ఎం.కిషోర్ మాట్లాడుతూ, పట్టాలు అందుకున్న విద్యార్థులు దేశ నిర్మాణానికి, సాంకేతిక అభివృద్ధికి అర్థవంతంగా తమవంతు సహకారమందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి యలమంచి ప్రదీప్, డైరెక్టర్ ఆర్. జ్యోతినాయుడు, వైస్ చైర్‌పర్సన్ డా.దుర్గాదేవి, మేనేజ్‌మెంట్ ట్రస్టీ సౌమ్య కిషోర్, అడ్వైజర్లు డాక్టర్ ఎంఎస్ పళనిస్వామి, వి.మనోహరన్, మాజీ ఐఏఎస్ అధికారి టి.పిచ్చాండి, ప్రిన్సిపల్ డా.ఎన్.సురేష్‌కుమార్, డీన్‌లు డా.కె.శివరాం, డాక్టర్ కె.రామర్, అకడమిక్ కో-ఆర్డినేటర్ డా.జి.దేవి విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పట్టాలు అందుకున్న విద్యార్థులతో ఆర్ఎస్ మునిరత్నం, ఆర్ఎం.కిషోర్, యలమంచి ప్రదీప్ తదితరులు


చెన్నై క్యాంపు కార్యాలయంలో ఈస్టర్ పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకుని కానుక అందజేస్తున్న ఎమ్మెల్యే ఇనికో ఇరుదయరాజ్

నందనం ఆర్ట్స్ కాలేజీలో రూ.4.80కోట్లతో 'కలైంజర్ కలైఅరంగం'

● ప్రారంభించిన డిప్యూటీ సీఎం

చెన్నై, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందనం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో రూ.4.80 కోట్లతో నిర్మించిన 'కలైంజర్ కలై అరంగం'ను ఆదివారం ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆ కళాశాల పూర్వవిద్యార్థి, ప్రొఫెసర్ ఆర్.రాజ్‌కుమార్ కళాశాల అభివృద్ధికోసం రూ.లక్ష విరాళంగా ఉదయనిధికి అందజేశారు. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ ఆరోగ్యశాఖమంత్రి ఎం.సుబ్రమణ్యం నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుండి కేటాయించిన రూ.4.80కోట్లతో ఈ హాలు నిర్మించినట్లు చెప్పారు. తాను లయోలా కాలేజీలో చదివినినా నందనం ఆర్ట్స్ కాలేజీ మైదానంలోనే ఎక్కువగా తిరిగానన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎం.సుబ్రమణ్యం, కోవి చెళియన్, శాసనసభ్యులు తాయగం రవి, ఎస్.అరవింద్ రమేష్, ఏఎంవీ ప్రభాకర్‌రాజా, కే గణపతి, డిప్యూటీ మేయర్ ఎం.మహేష్‌కుమార్, ఉన్నతవిద్యాశాఖ కార్యదర్శి సి. సమయమూర్తి, కళాశాలల విద్య కమిషనర్ ఎ.సుందరవల్లి, నందనం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సి.జ్యోతి వెంకటేశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.


కలైంజర్ కళై అరంగం ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

కోబీయింగ్ నుంచి

'స్కిన్ గ్లో కొల్లాజెన్' ఆవిష్కరణ

చెన్నై, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): 'ది కో బీయింగ్' నుంచి 'స్కిన్ గ్లో కొల్లాజెన్' విడుదలైంది. చెన్నైలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ నటి పార్వతి నాయర్ ముఖ్య అతిథిగా, రుబీనా ప్రత్యేక అతిథిగా హాజరై కొల్లాజెన్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రూప, డాక్టర్ నికిత, కవిత పాండ్యన్ తదితరులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ది కో బీయింగ్ మాతృ సంస్థ అయిన చెన్నైలోని ఇండస్ లైఫ్ సైన్సెస్ మేనేజింగ్ డైరెక్టర్ మణి మాట్లాడుతూ.. వినోదం, సాధికారత రెండింటినీ కలిగించేలా కొల్లాజెన్ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తాము కోరుకుంటున్నామని వివరించారు.



నూతన ఉత్పత్తిని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు